క్లుప్తంగా

పేదలకే రాజీవ్ యువ వికాసం వర్తింపజేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడరూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకాన్ని నిరుపేదలకే వర్తింపజేయాలని బీజేపీ జిల్లా నాయకుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ కార్యకర్తలకే ఈ పథకం వర్తించేలా కాకుండా అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు. నాయకులు రాజేందర్, కార్యకర్తలు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం



ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో శ్రీ మదేలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. రజక సంఘం బాధ్యులు నక్కదాసరి రవి, శ్రీకాంత్, బీజేపీ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, మాజీ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, శ్రీనివాస్‌రావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చింతాల్‌ఠాణాలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అర్చకులు గిరి శ్రీనివాస్, ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు రాము, మల్లారెడ్డి, దేవరాజు, లక్ష్మణ రావు, ప్రశాంత్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

అసంపూర్తి పనులు పూర్తిచేయాలి

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మర్రిపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా బ్రిడ్జిపైన బీట్ వాల్ నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న అకాలవర్షాలతో ఈ బ్రిడ్జిపై బురదమయంగా మారింది. బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేశ్ కార్యకర్తలతో అక్కడికి వెళ్లి నిరసన తెలిపారు. జిల్లా అధికారులు వెంటనే కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు చేయించి మిగిలిన పనులను పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యకర్తలు గోపు ప్రవీణ్, గుమ్మడి శ్రీనివాస్, లింగంపల్లి కుంటయ్య, పల్లికొండ నారాయణ, జలేందర్, నరేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

బోయినపల్లి: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి నెలరోజులు గడిచినా ధాన్యం కొనుగోళ్లు పూర్తికాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని మాన్వాడ, మల్లాపూర్‌లోని కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే తడిసిన ధాన్యాన్ని కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, నాయకులు ఐరెడ్డి మల్లారెడ్డి, భీమనాథుని రమేశ్, కట్ట గోవర్దన్, బత్తిని కమల్, సంజీవ్, ఎల్లారెడ్డి, కమల్, రైతులు ఉన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం



బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ మెడికవర్ వైద్యబృందం గ్రామంలో శనివారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. దాదాపు 150 మందికి ఈసీజీ, బీపీ, తదితర పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బుర్ర రాజు, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, శ్రీకాంత్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుంతను పూడ్చాలి

సాక్షి స్పందన

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని కోనాయపల్లి వార్డులో రోడ్డుపక్కన ప్రమాదకరంగా గుంత అనే శీర్షికన శనివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ వెంటనే గుంతను పూడ్చి సమస్యను పరిష్కరించాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఆదేశాలు జారీచేశా రు. వార్డు ప్రజలు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

చివరి ఆయకట్టుకు నీరందేనా?

- మానేరు ప్రాజెక్టు కెనాల్‌లో గుర్రపు డెక్క
- కాలువల్లో పేరుకుపోయిన పూడిక
- ఖరీఫ్ సాగుకు ముందే తొలగేనా..
- పట్టించుకోని అధికారులు



ముస్తాబాద్‌లోని కుడి కాలువలో గుర్రపు డెక్క

ముస్తాబాద్: జిల్లాలోని ఎగువ మానేరు ప్రాజెక్టు కింద కుడికాలువ గుర్రపు డెక్క, తుంగ, చెత్తతో నిండిపోయింది. ఖరీఫ్ సాగుకు ముందే మానేరు కుడి కెనాల్‌ను శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం మానేరు ప్రాజెక్టులో 0.5 టీఎంసీల నీరు ఉంది. వానాకాలంలో వర్షాలకు తోడు మల్లన్నసాగర్ ద్వారా గోదావరి జలాలు ఎగువ మానేరు ప్రాజెక్టును చేరుతాయి. ఈ క్రమంలో మానేరు కెనాల్స్ బాగు చేయాలని రైతులు అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పదివేల ఎకరాల ఆయకట్టు

ఎగువ మానేరు ప్రాజెక్టు కుడి కెనాల్ కింద పదివేల ఎకరాల ఆయకట్టు ఉంది. 30 కిలోమీటర్ల మేర కెనాల్ ఉండగా, గత రబీ సీజన్‌లో పదివేల ఎకరాలకు నీరందించారు. వానాకాలం పంటలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. నామాపూర్, రాంరెడ్డిపల్లె, గూడెం, ఆవునూర్, కొండాపూర్, గూడూరు, ముస్తాబాద్, పోతుగల్, తెర్లుమద్ది గ్రామాల్లో వరిపంట వేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. రబీ సీజన్‌లో కుడి కాలువ ద్వారా డిస్ట్రిబ్యూటరీ–18 వరకు మాత్రమే తైబంది నిర్ణయించిన సంగతి విదితమే. డి–23 వరకు తెర్లుమద్ది చివరి ఆయకట్టు స్థిరీకరణ జరగలేదు. రానున్న వానాకాలం పంటలకైనా చివరి ఆయకట్టుకు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

ఏటా సమస్య..

ప్రతి సీజన్‌లో మానేరు కెనాల్‌లో గుర్రపు డెక్క, తుంగతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. సాగు సీజన్ ఆరంభానికి ముందే కెనాల్‌ను బాగు చేయడం నీటి పారుదలశాఖ అధికారులకు తలనొప్పిగా మారింది. గత రబీ సీజన్‌కు ముందు రూ.3లక్షలు వ్యయంతో కుడి కాలువను జేసీబీ సాయంతో శుభ్రం చేయించారు. వానాకాలం ప్రారంభంలోనే మరోసారి కాలువల్లో గుర్రపు డెక్క, తుంగ విపరీతంగా పెరిగింది. కెనాల్‌లో నీటి ప్రవాహం తక్కువ కాగానే గూడూరు నుంచి తెర్లుమద్ది వరకు గుర్రం డెక్క పెరుగుతోంది. చెత్త, తుంగ, సిల్ట్‌తో కెనాల్స్ ఆనవాళ్లు కోల్పోతున్నాయి. వీటికి తోడు కొన్నిచోట్ల షట్టర్లు రిపేరులో ఉన్నాయి.

కెనాల్‌లో వ్యర్థాలు..

ముస్తాబాద్ పట్టణంలో దాదాపు రెండు కిలోమీటర్ల పరిధిలో మానేరు ప్రాజెక్టు కెనాల్ ఉంది. పట్టణానికి సంబంధించిన మురుగు నీరంతా కెనాల్‌లో చేరుతోంది. చికెన్ వ్యర్థాలు, ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, కవర్లు, సీసాలు కెనాల్‌లో చేరుతున్నాయి. దీంతోపాటు సిల్ట్ వచ్చి చేరుతోంది. రైతులు, కూలీలు కెనాల్‌లోకి దిగే సాహసం చేయడం లేదు. పైగా కెనాల్ పొడవునా దుర్గంధం వ్యాపించి, దోమలు పెరిగాయి. సాగునీటి కెనాల్ నుంచి మురుగు కెనాల్‌గా మారిపోయింది. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆరునెలల క్రితం కెనాల్‌ను సందర్శించి, మురుగు కెనాల్‌లో కలవకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని, రైతుల ఇబ్బందులు తొలగించాలని ఆదేశించినా ఫలితం లేదు.

ఏటా ఇబ్బంది



ప్రతి సీజన్‌లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గుర్రపు డెక్క, తుంగ, వ్యర్థాలతో పోతుగల్ కెనాల్ నిండిపోతుంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరు సరిగా అందడం లేదు. డి–18 షట్టర్ రిపేర్ చేయాలి. కెనాల్ నిర్వహణ సరిగా చేసేలా చూడాలి.

– ద్యావతి పందిరి, మాజీ సర్పంచ్, పోతుగల్

తెర్లుమద్దికి నీరందడం లేదు..



ముస్తాబాద్ వరకు మాత్రమే ప్రాజెక్టు నీరు వస్తోంది. చివరన ఉన్న తెర్లుమద్ది కెనాల్‌కు నీరందడం లేదు. ముస్తాబాద్‌లో రత్నాల కుంట నుంచి తెర్లుమద్ది వరకు ఉన్న కెనాల్ సరిగా లేదు. చాలాచోట్ల బుంగలు పడ్డాయి. అక్విడెటర్ల వద్ద లీకేజీలతో మా పొలాలకు నీరు రావడం లేదు.

– సతీశ్, తెర్లుమద్ది

యంత్రాలతో తొలగిస్తున్నాం



ప్రతి సీజన్‌కు ముందు కెనాల్ సమస్య వస్తోంది. కెనాల్‌లోకి పెద్ద ఎత్తున వ్యర్థాలు చేరుతున్నాయి. గుర్రపు డెక్క, తుంగను ప్రతి సీజన్‌లో తొలగిస్తున్నాం. తిరిగి మళ్లీ అది మొలకెత్తుతోంది. ఈ సీజన్‌లో కూడా గుర్రపు డెక్క, తుంగ తొలగించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

– వంశీకృష్ణ, ఏఈ, నీటిపారుదలశాఖ

ప్రొటోకాల్ పాటించకుంటే సహించం

- సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మధు
- ఎస్పీ మహేశ్ బీ గీతేకు వినతిపత్రం



ఎస్పీ మహేశ్ బీ గీతేకు వినతిపత్రం అందిస్తున్న మాట్ల మధు, బీఆర్ఎస్ నేతలు

సిరిసిల్లటౌన్: రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన అధికారుల అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రొటోకాల్ పాటించడం లేదని సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు పేర్కొన్నారు. ఇటీవల పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటోను పెట్టకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు ఎస్పీ మహేశ్ బీ గీతేకు శనివారం వినతిపత్రం అందించి, సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కేటీఆర్‌పై ఓడిపోయిన కాంగ్రెస్ నేతను అధికారిక కార్యక్రమాల్లో అతిథిగా కూర్చోబెట్టడం ఏంటని ప్రశ్నించారు. కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, యూత్ జిల్లా నాయకులు శీలం స్వామి, చిలువేరి చిరంజీవి, వేముల నరేశ్, మెరుగు తిరుపతి, కిరణ్, బండి జగన్, గుండు ప్రేమ్‌కుమార్, భాస్కర్‌గౌడ్, ఎండీ జహంగీర్, రత్నాకర్, అమర్‌రావు, రాజేశ్వరరావు, శేఖర్‌చారి, భరత్ పాల్గొన్నారు.

పాలిసెట్‌లో ప్రతిభ



ప్రద్యోతన్



రేవంత్



చరణ్‌రెడ్డి

సిరిసిల కల్చరల్: పద్మశాలీ ఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) సారథ్యంలో నెలరోజులపాటు అందించిన పాలీసెట్ ఉచిత శిక్షణ శిబిరం సత్ఫలితాలు సాధించింది. శనివారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో పోపా శిక్షణ తీసుకున్న పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో రాణించారు. 109 మార్కులతో రాష్ట్రస్థాయిలో 815వ ర్యాంకుతో ఆడెపు ప్రద్యోతన్ శిబిరంలో తొలి స్థానంలో నిలిచాడు. 102 మార్కులు 1017 ర్యాంకుతో దాసరి రేవంత్, 99 మార్కులు 1376వ ర్యాంకుతో బొప్ప రిత్విక్, 97 మార్కులు, 1671వ ర్యాంకుతో ఎ. చరణ్‌రెడ్డి వరుస స్థానాల్లో నిలిచారు. మొత్తం శిబిరంలో 100 మంది శిక్షణ తీసుకోగా 13మంది విద్యార్థులు 5వేల లోపు, మరో 25 మంది విద్యార్థులు 10 వేల లోపు ర్యాంకులు సాధించడం గర్వకారణం అని పోపా ఉపాధ్యక్షుడు మామిడాల భూపతి పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను, సహకరించిన పోపా ప్రతినిధులను అభినందించారు.



ఎం.వర్షిత శ్రీ వర్షిని



పారెల్లి ప్రాణిత్య



మెరుగు అక్షయ



దండు సవిత

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పాలిసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ఎంబీపీసీ విభాగంలో ఎం.వర్షిత శ్రీ వర్షిని 58, ఎంపీసీ విభాగంలో 188 వ ర్యాంకు, పారెల్లి ప్రాణిత్య 89వ ర్యాంకు, మెరుగు అక్షయ 231 ర్యాంకు సాధించారు. ఎంపీసీ దండు సవిత 90 వ ర్యాంకు, గొడిశాల మనోజ్ 161 వ ర్యాంకు సాధిం–న వారిలో ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో జ్ఞానదీప్ విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లోని జ్ఞానదీప్ హైస్కూల్ విద్యార్థులు సీహెచ్ సాత్విక్‌రెడ్డి 3,586, జె.స్నేహిత్‌చరణ్ 9,346 ర్యాంకులు సాధించినట్లు పాఠశాల చైర్మన్ మిట్టపల్లి లక్ష్మీనారాయణ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.

రాజీవ్ యువవికాసానికి నిధులు కేటాయించాలి

ముస్తాబాద్: ప్రభుత్వం నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసానికి రూ.15వేల కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. 16లక్షల మంది రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తులు చేసుకున్నారన్నారు. నాయకులు ఆదిత్య, సంతోష్, రమేశ్, శ్రీనివాస్, రాజు, భాను, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఆయా గ్రామాల్లోని కాలనీలు బురదమయంగా మారి, పిచ్చి మొక్కలు పెరుగుతుండడంతో మండల పరిషత్ అధికారుల ఆదేశాలతో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కార్యదర్శులు పంచాయతీ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో వర్షాలు కురవాలని కోరుతూ.. రైతులు శనివారం ముడుపు విప్పారు. ఆలయంలో రైతులు ప్రత్యేక పూజలు చేసి పంటలు సమృద్ధిగా పండాలని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో అకాల వర్షాలు పడవద్దని ఆలయంలో రైతులు ముడుపు కట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్లు లద్దునూరి హన్మండ్లు, మోతే లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు దొమ్మాటి నర్సయ్య, నిమ్మ లక్ష్మి, నిమ్మ మల్లారెడ్డి, మెరుగు గోవర్దన్, నారాయణరావు, కొండయ్య, కిషన్‌రెడ్డి, నిమ్మ సుధాకర్ రెడ్డి, మోతే పర్శరాములు, లింగం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్‌లో ఆదివారం నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్, అపోలో డయాగ్నొస్టిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌హమీద్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటలనుంచి 9 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● 53 కిలోల పటిక స్వాధీనం

కోనరావుపేట: మండలంలోని జైసేవాలాల్ భుక్యారెడ్డి తండాకు చెందిన మాలోత్ తిరుపతి వద్ద నాటు సారా తయారీకి వినియోగించే పటికను నిల్వ చేశాడన్న సమాచారం మేరకు కోనరావుపేట ప్రొబెషనరీ ఎస్సై రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. దాడిలో 53 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు పటికను స్వాధీనం చేసుకుని, తిరుపతిపై కేసు నమోదు చేశామన్నారు.

● బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

తంగళ్లపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ శివారు గండ్ల పోచమ్మ ఆలయం సమీపంలో శనివారం వృద్ధుడిని బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తంగళ్లపల్లికి చెందిన రాజయ్య లక్ష్మీపూర్ శివారు మామిడి తోటలో తోటమాలిగా పనిచేస్తున్నాడు. కాగా బిహార్ నుంచి వలస వచ్చిన ఇద్దరు కూలీలు ఎలక్ట్రికల్ స్కూటర్‌పై వేగంగా వచ్చి రాజయ్యను ఢీకొట్టారు. దీంతో రాజయ్య కాలు విరిగి అక్కడే పడిపోయాడు. 108 అంబులెన్స్‌కు కాల్ చేయడంతో సిబ్బంది చేరుకొని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

ముస్తాబాద్: పేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 24 మందికి రూ.9.28 లక్షల విలువైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, శీల ప్రశాంత్, మిడిదొడ్డి భాను, అంజనేయులు, షాదుల్ పాప, యాగండ్ల మల్లేశ్, నర్సయ్య తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి, సింగారం, ఎల్లారెడిపేట గ్రామాల్లో పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. రాచర్లగొల్లపల్లిలో రూ.2.55లక్షల విలువైన చెక్కులను ముగ్గురికి అందజేశారు. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సాహెబ్, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు చేపూరి రాజేశం, బండారి బాల్‌రెడ్డి, మర్రి నారాయణరెడ్డి, లత, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మద్యంతాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి, రాగట్లపల్లి గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 11 ద్విచక్రవాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మణ్ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించాలన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగుదొడ్లు నీటి వసతి లేక నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్రయాణికులు ఊపిరిబిగబడుతున్నారు. బస్టాండ్‌లో సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు మరుగు దొడ్లను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
కిషన్‌రావు, డీఎం, సిరిసిల్ల: సెల్ నంబర్: 9959225929

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

వానాకాలం ముందే వర్షాలు

- నేడు రోహిణి కార్తె ప్రవేశం..
- వేములవాడలో అత్యధికంగా 28.1 మిల్లీ మీటర్ల వర్షం..



వేములవాడ మండలం హన్మాజిపేట వద్ద పారుతున్న నక్కవాగు

సిరిసిల్ల: జిల్లాలో వానాకాలానికి ముందే వాన జల్లులు పడుతున్నాయి. రోహిణి కార్తె ప్రవేశంలో వానాకాలం ఆరంభమవుతుంది. ఆదివారం రోహిణి కార్తె ప్రవేశిస్తుండగా.. వారం రోజుల ముందే వర్షాలు పడడం విశేషం. రుతు పవనాలు ముందే వస్తున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. జిల్లాలోని వేములవాడ, చందుర్తి మండలాల్లో శనివారం అత్యధిక వర్షం నమోదైంది. ఈ వర్షాలతో పడువాటు నీళ్లు ఒర్రెల గుండా చేరి వేములవాడ మండలం హన్మాజిపేట వద్ద నక్కవాగు పారుతుంది. చందుర్తి మండల పరిధిలో కురిసే వర్షంతో నక్కవాగు పారే అవకాశం ఉండగా.. వర్షాలు దంచి కొట్టడంతో నక్కవాగులో వరద నీరు మల్లారం దాటింది. జిల్లావ్యాప్తంగా శనివారం నమోదైన వర్షపాతం వివరాలు.. రుద్రంగిలో 8.0 మిల్లీ మీటర్లు, చందుర్తిలో 24.6, వేములవాడ రూరల్‌లో 11.3, బోయినపల్లిలో 17.4, వేములవాడలో 28.1, సిరిసిల్లలో 11.6, కోనరావుపేటలో 21.2, వీర్నపల్లిలో 7.9, ఎల్లారెడ్డిపేటలో 21.3, గంభీరావుపేటలో 11.8, ముస్తాబాద్‌లో 24.2, తంగళ్లపల్లిలో 12.7, ఇల్లంతకుంటలో 18.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తిచేయాలి



ఎల్లారెడ్డిపేట: బాకూర్‌పల్లి తండాలో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు



చందుర్తి: నర్సింగాపూర్‌లో భూమిపూజ చేస్తున్న నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట: మూడునెలల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సుడిది రాజేందర్ అన్నారు. మండలంలోని బాకూర్‌పల్లితండాలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇల్లులేని నిరుపేదలను ఇందిరమ్మ కమిటీల ద్వారా 3,520 మందిని గుర్తించగా, మండలంలో 643 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌సింగ్, రవీందర్, మెండే శ్రీనివాస్, బండారి బాల్‌రెడ్డి, గంట బుచ్చాగౌడ్, రాజునాయక్, మోహన్‌నాయక్, హరీశ్, చంద్రునాయక్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరిగా పూర్తి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి కోరారు. మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి 33 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పార్టీ అధ్యక్షుడు రామస్వామితో పాటు మాజీ ప్రజాప్రతినిధులు భూమిపూజ (ముగ్గు) చేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను స్థానికంగా ఉన్న వాగులు, ఒర్రెల్లోంచి తీసుకువచ్చేందుకు కలెక్టర్ రెవెన్యూ అధికారులకు జారీచేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రం శ్రీమన్నారాయణ, మాజీ ఉపసర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సారంపల్లిలో రోడ్డు ప్రమాదం

- ధ్వంసమైన రెండు కార్లు, ఒక ఆటో



నుజ్జునుజ్జయిన స్విఫ్ట్ డిజైర్ కారు

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి ప్రధాన రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. రెండు కార్లు ఒక ఆటో ఢీకొన్న ఘటనలో అందరూ స్వల్పగాయాలతో బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాలు. వేములవాడ దర్శనానికి వచ్చిన యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన భక్తులు స్విఫ్ట్ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మండలంలోని సారంపల్లి శివారుకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటో ఢీకొట్టింది. దీంతో కారు అదుపు తప్పి సిరిసిల్ల వైపు వస్తున్న ఇన్నోవా కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు, ఒక ఆటో ధ్వంసమయ్యాయి. ఐదుగురికి స్వల్పగాయాలు కాగా 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. తంగళ్లపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఓ కారు డ్రైవర్ సత్యనారారయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రెయినీ ఎస్సై కె.వినీతారెడ్డి తెలిపారు.

నేడు మంజూరు పత్రాలు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆదివారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో బీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని మాతృశ్రీ ఫంక్షన్ హాల్‌లో 21 గ్రామాలకు చెందిన 500 మంది లబ్ధిదారులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

వీర్నపల్లి: మండలంలోని కంచర్లలో ఉచిత వైద్యశిబిరం కొనసాగుతుంది. ఎల్లారెడ్డిపేట మండల వైద్యాధికారి సరియా అంజుమ్ ఆధ్వర్యంలో పలువురికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు ఉన్నారు